క్లుప్తంగా

17, 18 తేదీల్లో కలెక్టరేట్ వద్ద ధర్నా

సీతంపేట: గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 17, 18 తేదీల్లో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్టు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.లక్ష్మణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ సమస్యలపై 48 గంటల ధర్నా చేయనున్నామన్నారు. ఐటీడీఏ ప్రోత్సాహంలో అన్ని ఐటీడీఏల పరిధిలో జీడి మొక్కలు వేసినప్పటికీ కాచిన జీడి పిక్కలకు మద్దతు ధరలు లేవన్నారు. అలాగే ప్రభుత్వం స్కూల్స్ మూసివేయడంపై, మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయాలని, విద్యా సంబంధ సమస్యలపై ధర్నా చేయనున్నట్టు పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

గుమ్మలక్ష్మీపురం: రైతులకు సబ్సిడీ(రాయితీ)పై అందించే వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు ఇతర పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని స్థానిక వాటర్ షెడ్ పథకం పీవో పోలినాయుడు ఓ ప్రకటనలో గురువారం కోరారు. డబ్ల్యూడీసీ–పీఎంకేఎస్‌వై 2.ఓ పథకంలో భాగంగా పవర్ వీడర్లు, టార్పాలిన్లు, ఇంజిన్లు వంటివి అందజేయడం జరుగుతుందన్నారు. కావాల్సిన వారు పట్టాదారు పాసుపుస్తకం, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, కుల ధ్రువీకరణ పత్రం, డీడీలను తెచ్చి, తమ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

పరీక్ష కిట్ల పంపిణీ



వార్డెన్‌లకు పరీక్ష కిట్లు అందజేస్తున్న ఏటీడబ్ల్యూవో సురేష్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలురు, బాలికల ఆశ్రమ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు అందివ్వాల్సిన పరీక్ష కిట్లను గుమ్మలక్ష్మీపురం ఏటీడబ్ల్యూవో బి.సురేష్‌కుమార్ మండల కేంద్రంలోని తన కార్యాలయం వద్ద ఆయా పాఠశాలల వసతిగృహాల వార్డెన్‌లకు గురువారం పంపిణీ చేశారు. ఈ నెల 17వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పార్వతీపురం ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ.. ప్రతి విద్యార్థికి అట్టతో పాటు రెండు పెన్నులు, ఓ జామెట్రీ బాక్సు సమకూర్చి, వాటిని విద్యార్థులకు ఇవ్వాలని ఆదేశించినట్లు ఏటీడబ్ల్యూవో తెలిపారు. విద్యార్థులంతా పరీక్షలు బాగా రాసి, ఉత్తమ మార్కులు సాధించాలని ఆకాంక్షించారు.

ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులు కావాలి



విద్యార్థులకు అట్టలు, పెన్నులు అందజేస్తున్న డీఈవో తిరుపతినాయుడు

గరుగుబిల్లి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులంతా ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులు కావాలని డీఈవో ఎన్.తిరుపతినాయుడు ఆకాంక్షించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అట్టలు, పెన్నులను ఆయన గురువారం పంపిణీ చేశారు. ఈ నెల 17వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నందున ప్రతిఒక్కరూ పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో బీల పద్మావతి, సత్యనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైకిల్ షెడ్‌ను డీఈవో ప్రారంభించారు. పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరిస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈవో-1 దత్తి అప్పలనాయుడు, హెచ్ఎం ఎస్ఎల్ పాత్రుడు, ఎంఈవో-2 కె.కొండలరావు, ఎస్ఎంసీ చైర్మన్ శ్వాతి, ఉపాధ్యాయుడు కె.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన అవసరం

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతు శాస్త్ర విభాగం, ఐక్యూ ఏసీ నేతృత్వంలో కెరీర్ గైడెన్స్ ప్రోగ్రాం చేపట్టారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు అధ్యక్షతన గురువారం చేపట్టిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖ ఆంధ్రా విశ్వవిద్యాలయ మెరైన్ లివింగ్ రీసోర్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ పి.సమత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్ సవాళ్లను అధిగమించేందుకు అందుబాట్లో ఉన్న అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. లక్ష్యాత్మకమైన జ్ఞానాన్ని సంపాదించుకోవాలని విద్యార్థులకు ఆమె సూచించారు. కెరీర్ గైడెన్స్‌పై అవగాహన పెంచుకోవటం ద్వారా ముందు చూపుతో భవిష్యత్తు నిర్ణయాలు సమర్థవంతంగా తీసుకునే అవకాశం ఉంటుందంటూ పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, బి.రాజు, ఎం.శాంతితో పాటు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

సర్వేలో పొరపాట్లు లేకుండా చూడాలి

పాలకొండ రూరల్: పీ–4 సర్వేలో పొరపాట్లకు చోటు లేకుండా నమోదు చేపట్టాలని ఎంపీడీఓ విజయ రంగారావు అన్నారు. మండలంలోని వెలగవాడ, సిరికొండ, మల్లమ్మగూడ తదితర ప్రాంతాల్లో కార్యదర్శులు చేపడుతున్న సర్వే తీరును గురువారం స్వయంగా పరిశీలించారు. ఈ సర్వేపై ప్రజలు అగిడిన సందేహాలను ఎంపీడీఓ నివృత్తి చేశారు. అనంతరం వెలగవాడ సచివాలయాన్ని సందర్శించిన అధికారి అక్కడి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వేసవి నేపథ్యంలో తాగునీటి వనరుల అభివృద్ధి, పారిశుధ్య పనులపై ఆరా తీశారు. ప్రజలు అందించే ఫిర్యాదులపై స్పందించాలన్నారు.

ఆందోళన వీడాలి..

- ఈ నెల 17వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



పునశ్చరణ తరగతుల్లో నిమగ్నమైన ఎం.సింగుపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

పాలకొండ రూరల్: విద్యార్థి దశలో కీలకమైన పదో తరగతి పరీక్షలను ఎదుర్కొనేందుకు విద్యార్థులకు మరో నాలుగు రోజుల గడువు మాత్రమే ఉంది. ఇప్పటికే విద్యాశాఖ పరీక్షల నిర్వహణ కసరత్తులో నిమగ్నమై ఉన్నారు. తొలిదఫా పబ్లిక్ పరీక్షలు రాయడమంటే సర్వసాధారణంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో కొంత ఆందోళన ఉంటుంది. అయితే పరీక్షకు పరీక్ష మధ్య విరామం ఉండడంతో విద్యార్థులు రివైజ్ చేసుకోవచ్చని.. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఆందోళనకు లోనుకాకూడదని విద్యా నిపుణులు, వైద్యులు చెబుతున్నారు. ఈ నెల 17 నుంచి 31 వరకు పదో తరగతి పరీక్షల షెడ్యూల్ నిర్దేశించారు. రంజాన్ పవిత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని 31వ తేదీన నిర్వహించాల్సిన సాంఘిక శాస్త్రం పరీక్ష అదే రోజున నిర్వహిస్తారా... లేక ఏప్రిల్ 1న చేపడతారా అన్న అంశమై స్పష్టత రావాల్సి ఉందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. పరీక్ష సమయంలో రోజు తప్పి రోజు పరీక్ష ఉండడంతో సబ్జెక్ను నెమరువేసుకునేందుకు విద్యార్థులకు చక్కటి అవకాశం.

షెడ్యూల్ ఇలా...

మండల కేంద్రం పాలకొండలో గల పెద్ద కాపువీధి జెడ్పీ ఉన్న పాఠశాలతో పాటు స్థానిక పోస్టాఫీస్ ఎదురుగా ఉన్న జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, ప్రధాన రహదారిలో గల స్టేట్‌బ్యాంక్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, తమ్మినాయుడు, సత్యసాయి, వివేకానంద విద్యా సంస్థలను పరీక్ష కేంద్రాలుగా నిర్దేశించారు. ఇప్పటికే సదరు కేంద్రాలను అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలించారు. ఈ నెల 17న తెలుగు/కాంపొజిట్ తెలుగు-1, 19న హిందీ, 21న ఆంగ్లం, 24న గణితం, 26న భౌతికశాస్త్రం, 28న జీవశాస్త్రం, 31న సాంఘిక శాస్త్రం పరీక్షలు జరగనున్నాయి. గతంలో రెండు పేపర్ల విధానంలో జరిగే పరీక్షలు ఈ ఏడాది ఒకే పేపర్ విధానంలో జరగనున్నాయి.

పటిష్ట చర్యలు..



గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని సహచర సిబ్బంది సమన్వయంతో ఈ ఏడాది పరీక్షల నిర్వహణకు పటిష్ట చర్యలు చేపట్టాం. మండలంలో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా వంద రోజుల ప్రణాళితో విద్యార్థులను అన్నివిధాలా సిద్ధం చేశాం. ఈ ఏడు పరీక్షల మధ్య ఒక్కరోజు సమయం ఉండడం పిల్లలపై ఒత్తిడి తగ్గనుంది. ఆ సమయాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలి. గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది రెగ్యులర్ విద్యార్థులతో పాటు ఓపెన్ టెన్త్ పరీక్షలు రాసే విద్యార్థులు ఒకే సమయంలో పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుంది. వీరికి ప్రత్యేక సమయాలంటూ ఏమీ లేవు.

– కురిటి సోంబాబు, మండల విద్యాశాఖాధికారి, పాలకొండ

32 పరీక్ష కేంద్రాలు



పాలకొండ డివిజన్ పరిధిలో ఏడు మండలాలకు సంబంధించి 32 పరీక్ష కేంద్రాలను నిర్దేశించారు. వీటి ద్వారా ఈ ఏడాది 4,725 మంది రెగ్యులర్ విద్యార్థులతో పాటు ప్రైవేట్, ఒక్కసారి పరీక్ష ఫయిల్ 22 మంది పరీక్షలు రాయనున్నారు. 32 మంది చీఫ్ సూపరింటెండెట్లు, 32 మంది డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించాం. జిల్లా అధికారుల సూచనలతో ఫ్లయింగ్, ఇతర స్క్వాడ్ విభాగం, పరీక్ష కేంద్రం స్థితిగతులకు అనుగుణంగా ఇన్విజిలేటర్ల ఏర్పాటు ఉంటుంది. రిమోట్ విలేజ్‌లకు పరీక్ష పేపర్లను కారుల ద్వారా తీసుకువెళ్లేందుకు చర్యలు తీసుకున్నాం. అక్కడ ప్రత్యేక సిట్టింగ్ స్క్వాడ్ నియమిస్తాం. ఇప్పటికే పరీక్ష ప్రతాలను ఆయా మండలాల పోలీస్ స్టేషన్లలో భద్రపరిచాం.

–వప్రి కృష్ణమూర్తి, డిప్యూటీ డీఈఓ, పాలకొండ

తోటపల్లి నీరు విడుదల చేయాలి



డీఈఈకి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం ఏజేసీ నాయకులు

పాలకొండ: వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు తోటపల్లి ఎడమ కాలువ ద్వారా నీరు విడుదల చేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు రైతు సంఘం నాయకుడు బుడితి అప్పలనాయుడు ఆధ్వర్యంలో జల వనరుల శాఖ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ కాలంలో ఏర్పాటు చేసిన తోటపల్లి కాలువ ద్వారా ఆయకట్టులో ఏడాదికి రెండు పంటలు పండించే అవకాశం ఉండేదని తెలిపారు. కాలం గడిచిన కొద్ది కాలువలో షట్టర్లు పాడైపోవడం, కాలువ శిథిలం కావడంతో వేసవిలో జోన్ పద్ధతి ద్వారా ఆరు తడి పంటలకు, మూగజీవాల కోసం నీరు విడుదల చేసేవారని తెలిపారు. ప్రస్తుతం ఈ విధానం కూడా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునికీకరణ పనులతో వేసవిలో నీటి సరఫరా నిలిపివేశారని, ప్రస్తుతం ఆధునికీకరణ పనులు కూటమి ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపించారు. నీటి సంఘాల ఎన్నికలు చేపట్టిన ప్రభుత్వం వాటి ద్వారా పనులు పూర్తి చేసి నీరు విడుదల చేయాలని కోరారు. అనంతరం డీఈఈ గణిరాజుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో రైతులు కిమిడి రామూర్తి, సంఘంనాయుడు, చిన్నంనాయుడు, వైకుంఠరావు, గౌరినాయుడు పాల్గొన్నారు.

ఆశీల వేలం పాట రూ.13.50 లక్షలు



వేలం పాట నిర్వహిస్తున్న కమిషనర్

పాలకొండ: నగర పంచాయతీలో ఆశీల వసూలు వేలం పాట గురువారం నగర పంచాయతీ కార్యాలయంలో బహిరంగంగా నిర్వహించారు. రోజు వారి మార్కెట్‌తో పాటు సంతలు, కూరగాయలు, జంతు వధ శాలలు, తోపుడు బండ్లు తదితర వాటి నుంచి ఆశీల వసూళ్లతో పాటు చెట్లు ఫలసాయం ఏడాది పాటు అనుభవించేందుకు ఈ పాటను నిర్వహించారు. ఇందులో కటకం దుర్గారావు అత్యధికంగా రూ.13.50 లక్షలకు వేలం పాట దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ జయరాం మాట్లాడుతూ వేలం పాట పొందిన వారు ముందుగా నాలుగవంతు డబ్బు చెల్లించాలని తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు మాత్రమే ఈ పాటదారు హక్కులు పొంది ఉంటారని తెలిపారు.

గిరిజన గ్రామాల్లో ట్రైనీ ఎస్ఐలు



కురుపాం వారపు సంత ప్రాంతంలో ఎస్ఐ నారాయణరావు, ట్రైనీ ఎస్ఐలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని రంగుపురం, షేకుపాడు, దండుసూర గిరిజన గ్రామాల్లో కురుపాం ఎస్ఐ పి.నారాయణరావుతో కలిసి ట్రైనీ ఎస్ఐలు శ్రీను, శ్రావణి, లావణ్యలు గురువారం పర్యటించారు. వివిధ చట్టాలతో పాటు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, సైబర్ నేరాల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అక్కడి నుంచి ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామమైన సందబడితో పాటు కురుపాంలోని వారపు సంత ప్రదేశాన్ని సందర్శించి, అక్కడి వారికి పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణకు చేపడుతున్న చర్యలు, ఫ్రెండ్లీ పోలీసింగ్ వంటి అంశాలను తెలిపారు.

ఫిష్ సీడ్ ఫామ్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలం పరిశీలిస్తున్న జిల్లా మత్స్య శాఖ అభివృద్ధి అధికారి తిరుపతయ్య

గరుగుబిల్లి: ఫిష్ సీడ్ ఫామ్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేసినట్లు జిల్లా మత్స్య శాఖ అభివృద్ధి అధికారి వి.తిరుపతయ్య తెలిపారు. మండలంలోని గిజబ గ్రామంలో ఇరిగేషన్ శాఖ ఆధీనంలోని స్థలాన్ని ఆయన సిబ్బందితో కలిసి గురువారం పరిశీలించారు. ఇదే ప్రాంతంలో ఫిష్ సీడ్ ఫామ్ ఏర్పాటైతే ఇక్కడి మత్స్యకారులకు ఎంతో ఉపయోగకరమన్నారు. ఇక్కడ ఫిష్ సీడ్ ఫామ్ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి కూడా అనుమతులు వచ్చాయని, త్వరలోనే పనులు చేపట్టి పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ జేఈ కిశోర్‌కుమార్, సర్వేయర్ ఎస్.అప్పలస్వామి, వీఆర్వో టి.రవికుమార్, మత్స్యశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు డి.లక్ష్మణరావు, ఎంపీటీసీ ఎం.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఆటోలకు సీరియల్ నంబర్లు కేటాయింపు



సీరియల్ నంబర్లు ఉన్న స్టిక్కర్లును చూపిస్తున్న ఎస్ఐ, ఆటో డ్రైవర్లు

వీరఘట్టం: మండలంలో ఉన్న అన్ని ఆటోలకు గురువారం ఎస్.ఐ జి.కళాధర్ సీరియల్ నంబర్లను కేటాయించారు. ఈ సీరియల్ నంబర్లుతో ఉన్న స్టిక్కర్లును ఆటో డ్రైవర్లుకు అందజేశారు. ఆ స్టిక్కర్లును ఆటోలకు అతికించారు. ఈ సీరియల్ నంబర్లు ఉండడం ద్వారా ఆటోలు ప్రమాదాలకు గురైనా, పరిమితికి మించి ప్రయాణికులతోగాని, వేగంగా వెళ్లినా సంబంధిత ఆటోలను సులువుగా గుర్తించవచ్చునన్నారు. ఆటో డ్రైవర్లు సురక్షిత ప్రయాణాలు చేసేందుకే ఈ సీరియల్ నంబర్లు కేటాయించామన్నారు. ఆయనతో పాటు ఏఎస్ఐ కృష్ణంనాయుడు, మోటారు వర్కర్ల యూనియన్ అధ్యక్షుడు చుక్కా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి



విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర నుంచి అడ్మిషన్ పత్రం తీసుకుంటున్న ఉపాధ్యాయులు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు ఎంపీయూపీ పాఠశాల సిబ్బంది.. అదే గ్రామంలో పాఠశాలలో పిల్లల ప్రవేశం(అడ్మిషన్‌లు)పై గురువారం ప్రచారం నిర్వహించారు. ఒకటో తరగతిలో చేరే వయసు కలిగిన చిన్నారుల తల్లిదండ్రుల ఇంటి వద్దకు వెళ్లి, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వాలు కల్పిస్తున్న సదుపాయాలను క్షుణ్ణంగా వివరించారు. అనంతరం పలువురి తల్లిదండ్రుల దగ్గర నుంచి వారి పిల్లల ఒకటో తరగతిలో ప్రవేశానికి సంబంధించి, అడ్మిషన్ పత్రాలు తీసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హరి కృష్ణ, సర్పంచ్ గుంట్రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏనుగులు ఎక్కడున్నాయో రైతులకు చెప్పండి



అటవీ శాఖ సిబ్బందికి సూచనలిస్తున్న డీఎఫ్‌వో ప్రసూన

జియ్యమ్మవలస: ఏనుగులు సంచారం ఎక్కడెక్కడ ఉందన్న సమాచారాన్ని రైతులకు ఎప్పటికప్పుడు చెప్పి, అప్రమత్తం చేయాలని డీఎఫ్‌వో ప్రసూన సూచించారు. మండలంలోని వెంకటరాజపురం, బాసంగి, సుభద్రమ్మవలస, పెదమేరంగి పరిసర ప్రాంతాల్లో గత వారం రోజులుగా జరుగుతున్న ఏనుగుల గుంపు సంచారంతో ఆయా ప్రాంతాల్లోని పంటలకు నష్టం జరిగిన విషయం తెలిసిందే. ఈ మేరకు వెంకటరాజపురం రహదారి వద్ద అటవీ శాఖ సిబ్బంది, టీకర్స్‌తో ఆమె గురువారం సమావేశమై, పలు సూచనలు చేశారు. ఏనుగుల కారణంగా రైతులు నష్టపోకుండా చూడాలని, పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందుతుందనే విషయాన్ని తెలియజేయాలని తెలిపారు.

నేటి నుంచి రాధాకృష్ణుల డోలోత్సవాలు



డోలోత్సవాలకు అలంకరించిన మూలవిరాట్‌లు

భామిని: మండలంలోని లివిరిలో వెలసిన పర్లాఖిమిడి గజపతుల ఆరాధ్య దైవంగా విలసిల్లిన శ్రీగోపీనాథ రాధాకృష్ణుల డోలోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరంగా చేశారు. ఈ నెల 14 నుంచి 23 వరకు ఈ ఉత్సవాలు జరగనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం రాత్రి లివిరిలో మగా కాల్చి డోలోత్సవాలు ప్రారంభించారు. ఉత్సవాల్లో ముఖ్యమైన హోళి ఉత్సవం ఈ నెల 15న ఉత్కళ సాంప్రదాయంలో శనివారం నిర్వహించనున్నారు.

నేటి నుంచి డోలాయాత్ర మహోత్సవాలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం శివన్నపేటలో జగన్నాథస్వామి డోలాయాత్ర మహోత్సవాలు ఈ నెల 14, 15వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, రాత్రి వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఇన్విజిలేషన్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

వీరఘట్టం: ఈ నెల 17 నుంచి జరగనున్న పదో తరగతి ఇన్విజిలేషన్ ప్రక్రియ అస్తవ్యస్తంగా ఉందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. నిబంధనల ప్రకారం టెన్త్ ఇన్విజిలేషన్ డ్యూటీలో ఉన్నవారు తాము పనిచేస్తున్న పాఠశాలకు ఎనిమిది కిలోమీటర్ల లోపు ఉన్న పరీక్ష కేంద్రానికి వేయాలని, అయితే వీరఘట్టం మండలంలో తలవరం, తెట్టంగి, నీలానగరం ఉన్నత పాఠశాలల్లో పనిచే స్తున్న స్కూల్ అసిస్టెంట్లను ఎనిమిది కిలోమీటర్లు దూరం దాటి ఉన్న బిటివాడ, గంగమ్మపేట, వీరఘట్టం గరల్స్ పరీక్ష కేంద్రాలకు ఇన్విజిలేషన్ డ్యూటీ వేశారని పేర్కొన్నారు. కావున తలవరం, తెట్టంగి, నీలానగరం పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులను ఇన్విజిలేషన్ డ్యూటీ నుంచి మినహాయింపు ఇచ్చి పరీక్ష కేంద్రానికి ఎనిమిది కిలోమీటర్లలోపు పని చేస్తున్న ఉపాధ్యాయులను ఇన్విజిలేటర్లుగా నియమించాలని కోరారు.

దరఖాస్తు చేసుకోవాలి

పాలకొండ రూరల్: బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తులు చేసుకునేందుకు వెబ్‌సైట్ తెరిచినట్లు ఎంపీడీఓ ఎం.విజయరంగారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 – 50 సంవత్సరాల మధ్య వయస్సు గల వారు ఈ నెల 22వ తేదీలోగా మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 23 నుంచి 26 మధ్య వచ్చిన దరఖాస్తులను పరిశీలన చేపట్టి, అర్హుల జాబితాలను బ్యాంకు అధికారుల అనుమతితో కలెక్టర్‌కు నివేదించనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో శ్లాబ్-1 కేటగిరీలో బీసీ–ఏలకు 3, బీసీ–బీలకు 4, బీసీ–డీలకు 27, శ్లాబ్-2 కేటగిరీలో బీసీ–ఏలకు 1, బీసీ–బీలకు 1, బీసీ–డీలకు 8, శ్లాబ్-3 కేటగిరీలో బీసీ–డీలకు 3 యూనిట్లకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం

జియ్యమ్మవలస రూరల్: ప్రతీ గ్రామాన్ని సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దుదామని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు పిలుపునిచ్చారు. మండలంలోని చినమేరంగి గ్రామంలో సారా తయారీ, రవాణా, అమ్మకాల నిషేధంపై గురువారం అవగాహన కల్పించారు. సారా తయారీ కేంద్రాలపై ఆకస్మిక దాడులు నిర్వహిస్తున్నామని, సారా లేకుంటే చాలామంది జీవితాల్లో వెలుగులు వస్తాయన్నారు. సారా తయారీ, రవాణా, అమ్మకాలు జరగకుండా కృషి చేసే వారికి కలెక్టరు చేతులమీదుగా ప్రశంసాపత్రంతో అభినందనలు తెలియజేసి, జీవనోపాధి అవకాశాలు ప్రభుత్వం ద్వారా కల్పిస్తామన్నారు. అనంతరం సారా నిషేధంపై గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కురుపాం ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు, సర్పంచ్ రవణమ్మ, ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజేంద్రప్రసాద్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యు త్ తీగలను ఆనుకుని ఉండే చెట్లకొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

జియ్యమ్మవలస రూరల్: మండల పరిధిలోని కుదమ విద్యుత్ సబ్‌స్టేషన్, 11 కేవీ ఫీడర్ పరిధిలోని సింగనాపురం, పెద్దకుదమ, చిన్నకుదమ, గౌరీపురం, తురకనాయుడువలస గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

విద్యాలయాల్లో ప్రమాణాలు గుర్తించండి



వీఓఏలకు శిక్షణ ఇస్తున్న రీసోర్స్‌పర్సన్ నారాయణరెడ్డి

భామిని: ప్రభుత్వ విద్యాలయాల్లో బోధన పటిమను విధిగా గుర్తించాలని పరిమళ ఫౌండేషన్ ఎసెస్‌మెంట్ సంస్థ రీసోర్సుపర్సన్ నారాయణరెడ్డి అన్నారు. వెలుగు కార్యాలయంలో ఏస్పిరేషనల్ బ్లాక్‌లో భాగంగా గ్రామైఖ్య సంఘాల సహాయకులకు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలకు వీఓఏలు వెళ్లి విద్యా ప్రమాణాలు గుర్తించే పద్ధతులను వివరించారు. గ్రామాల్లో సీఏఫ్‌గా పిలిచే వీఓఏలు మహిళా సంఘాల సభ్యుల సహకారం తీసుకోవాలన్నారు. వెలుగు సీసీలు చిట్టిబాబు, సీఓ రాజు, అకౌంటెంట్ కృష్ణవేణి, వీఓఏలు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు



పరీక్ష కేంద్రం నుంచి ఆనందంగా బయటకు వస్తున్న విద్యార్థులు

భామిని: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు గురువారంతో ముగిశాయి. పరీక్షలు రాసిన విద్యార్థులు ఆనందంగా ఇంటి ముఖం పట్టారు. గురుకులం, కేజీబీవీ విద్యార్థుల కోసం తల్లిదండ్రులు రాగా వారితో కలిసి ఇళ్లకు వెళ్లారు. భామిని ఇంటర్ పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌గా ఎస్‌వీఎల్ నారాయణ, డిపార్టుమెంట్ అధికారిగా డి.లక్ష్మీనారాయణ వ్యవహరించారు.

దేశ సేవకులకు పౌర సన్మానం



అవలంగిలో తల్లి పార్వతమ్మతో కలసి పౌర సన్మానం పొందుతున్న సైనిక సోదరులు

పాలకొండ రూరల్:

వారిద్దరూ అన్నదమ్ములు... చిన్నతనం నుంచి సైనిక ఉద్యోగంలో చేరి దేశ సేవ చేయాలన్నది వారి ఆకాంక్ష. కఠోర శారీరక శ్రమ.. నిరంతర కృషి... తల్లితండ్రుల, సహచరుల ప్రోత్సాహంతో అనుకున్న లక్ష్యం సాధించారు. 27ఏళ్ల క్రితం దేశ రక్షణ వ్యవస్థలో సైనికులుగా కొలువులు సాధించారు. అంచలంచలుగా పలు కీలక ప్రాంతాల్లో విధులు చేపట్టి పదోన్నతలు పొందారు. తాజాగా వీరు పదవీ విరమణ పొంది కుటుంబాలతో స్వగ్రామం చేరుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, అక్కడి యవత ఆ సైనిక సోదరులకు గురువారం రాత్రి ఘనంగా పౌర సన్మాం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. పాలకొండ మండలం అవలంగి గ్రామానికి చెందిన నగరపు వెంకటనాయుడు, పార్వతమ్మ దంపతులు పెద్ద కుమారుడు రవిబాబు(సుబేదార్ ఇండియన్ ఆర్మీ), రెండవ కుమారుడు మురళీధర్ (హవల్దార్ ఇండియన్ ఆర్మీ)గా విధులు నిర్వహించారు. గ్రామీణ వ్యవసాయ కుటుంబం నుంచి దేశ సేవకు 27 ఏళ్ల క్రితమే ఈ సోదరులు సిద్ధమయ్యారు. జమ్ముకశ్మీర్‌తో పాటు కీలక ప్రాంతాల్లో కౌంటర్ ఇంటెలిజెన్సీలో సుదీర్ఘ సేవలు అందించి అనేక పథకాలు, ఉన్నతాధికారుల ప్రశంసలు పొందిన వీరు స్వగ్రామం చేరిన క్రమంలో సన్మానం చేసిన గ్రామస్తులు ఈ సోదరులను స్ఫూర్తిగా తీసుకోవాలని యువతకు సూచించారు. ఇదిలా ఉంటే ఆ సోదరుల్లో చివరివాడైన గిరిప్రసాద్ తిరుపతి పోలీస్ శాఖలో విధులు చేస్తుండటం విశేషం.